“వాడితో అష్టాచమ్మా ఆడదామని పిలిచ...లేకపోతే ఏంటా ప్రశ్న. నాకా బఠానీలు తినాలనిపించి పిలిచా” ఆవిడ సీరియస్‌గా సమాధానం చెప్పింది.

“ఏం అక్కర్లేదు. నువ్వెళ్ళరా?” బఠానీలు అమ్మే కుర్రాడి వంక చిరాకుగాచూస్తూ అన్నాడు భర్త.

“నువ్వుండు బాబూ.... రెండు రూపాయల బఠానీలు ఇవ్వు” అంది భార్య.

“నాకు ఇలా రోడ్డుమీద బటానీలు, శనగలు తినడం యిష్టం లేదని చెప్పానా?”

“ఇది రోడ్డుకాదు. పార్కు అయిన మీకు ఇష్టం లేకపోతే మీరు తినకండి.....నాకు ఇష్టం నేను తింటాను.

“ఛీ..... అన్నీ లేకీ బుద్ధులు, లేకి అలవాట్లు. మీ వంశమే అంత?” అన్నాడు భర్త.

“మాట్లాడితే మా వంశం మాటెత్తుతారేం? మాది లేకివంశం అయితే మీది దరిద్రగొట్టు వంశం” మండిపడింది భార్య.

“మాటలు తిన్నగా రానియ్ లేకపోతే పళ్లు రాల్తాయ్”

“బటానీలు తింటే పరువు తక్కువగానీ పబ్లిక్ ప్లేస్‌లో భార్య మీద ఇంత పెద్ద గొంతేసుకుని నానా మాటలు అంటే పరువుతక్కువ కాదనుకుంటా”

“నోర్మూయ్...అతిగా మాట్లాడకు” అరిచాడు భర్త.

బఠానీలు అమ్మే కుర్రాడు నాకెందుకొచ్చిన గొడవ అని అక్కడి నుండి చల్లగా జారుకున్నాడు.

“హు.....పెళ్ళికాకముందు నా వెనకాల పడి నేను వద్దన్నా అన్నీ కొనిచ్చేవారు. ఇప్పుడు ఆఫ్టరాల్ బటానీలు తినాలన్న మీచేత అడ్డమయిన మాటలు పడాల్సివస్తుంది. ఛీ....... ఛీ...... మీతో బయటికొచ్చేకంటే ఇంట్లో మూల కూర్చుని వుండడమే మేలు” అంటూ ఆమె చివాలున లేచి పార్కు బయటికి చరచరా నడిచి వెళ్ళిపోయింది. ఆమె భర్త కూడా ధుమధుమ లాడుతూ బయటికి వెళ్లిపోయాడు.

జరిగిన తంతు అంతా బుచ్చిబాబుతో పాటు సీత కూడా చూసింది.

“చూసావా! వాళ్లు కూడా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నవాళ్ళే. ఇప్పుడు చూడు వాళ్ళ సంసారం సిల్లీగా ఎలా ఏడ్చిందో?” సీతతో మెల్లగా అన్నాడు బుచ్చిబాబు.

“అందరూ అలా వుండరుకదా?” అంది సీత.

“అందరూ అలాగే వుంటారు”

“అయితే ఏమంటావ్? పెళ్లి చేసుకోనంటావు? సరే అలాగే అది నీ పర్సనల్ విషయము. నీ దారి నీది, నా దారి నాది” బాధపడుతూ అంది సీత.

‘అలా వీల్లేదు సీత నీ దారి నా దారి ఒక్కటే నాకు నువ్వు కావాలి’ సీత చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు బుచ్చిబాబు.

“నీ ఉద్దేశ్యం ఏమిటి? నువ్వు పెళ్ళి చేస్కోవు కానీ నీకు నేను కావాలి! నీకు

ఉంపుడుగత్తెగా ఉండమంటావా?" అతని చేతిలోంచి తన చేతిని లాక్కుంటూ అంది సీత.

బుచ్చిబాబు ఆమె మాటలకు బాధపడ్డాడు.

"సరే ..... నీకు నేనంత నీచుడిలా కనిపిస్తున్నానా? అయినా నా ఉద్దేశ్యం ఏమిటో నీకు తెలుసు. తెలిసి ఎందుకిలా బాధపడ్తావ్?"

"నీ ఉద్దేశ్యం అంత మంచిదికాదు బుచ్చీ"

"ఎందుకు మంచిదికాదు. నీకు మొన్ననే వివరంగా చెప్పాను. అయినా అర్థం కాలేదు?"

"ఏమో? పెళ్లి చేసుకోకుండా ఒక అమ్మాయి ఒక అబ్బాయి కలసి జీవించడం ఈ సంఘం ఒప్పుకుంటుందంటావా?"

"కొత్త విషయం ఏదైనా ఈ సంఘం ఒప్పుకోదు. అదీ ఇలాంటి విప్లవాత్మకమైన విషయాన్ని అసలు ఒప్పుకోదు. విధవా వివాహాల్ని, ప్రేమ వివాహాల్ని, కులాంతర, మతాంతర వివాహాల్ని కూడా సంఘం మొదట్లో ఒప్పుకోలేదు. మరి ఇప్పుడు? అలానే మన విషయం కూడా. మనం మన భావితరాలవారికి ఆదర్శమ కావాలి. అందరు జీవితాంతం ప్రేమైక జీవనాన్ని గడపాలి" ఆవేశంగా అన్నాడు బుచ్చిబాబు .

సీత నవ్వింది.

"బుచ్చీ! నువ్వు అమాయకుడివో మూర్ఖుడివో నాకు తెలియడం లేదు"

"ఏదైనా అనుకో. కానీ నన్ను కాదనకు"

"ఎంతసేపూ నీ ఆలోచన నీదేకానీ నాకు చెడు జరిగినా నీకు ఫర్వాలేదు అంతేగా?"

" సీత ! నా మీదే నీకు అనుమానమా? పెళ్ళి చేసుకోనంత మాత్రాన నిన్ను వదిలేస్తానా? మెడలో తాళి కట్టి పెళ్ళి చేస్కున్న ఎంతమంది భర్తలు తమ భార్యల్ని వదిలివేయటం లేదు?"

"నీ ప్రేమ మీద నాకు నమ్మకం వుంది బుచ్చిబాబు, కానీ నా సోషల్ స్టాటస్ గురించి ఆలోచించావా? అందరూ నన్ను నీ ఉంపుడుగత్తెనని అనుకోవడం నేను భరించలేను. అయినా నా గురించి అందరూ అలా అనుకోవడం నీకు మాత్రం నచ్చుతుందా?" అడిగింది సీత బుచ్చిబాబు గడ్డం పట్టుకుని.

బుచ్చిబాబు ఆలోచనలో పడ్డాడు.

"నువ్వు ఇన్నీ కబుర్లు చెప్తున్నావుగని మీ అమ్మానాన్న నువ్విలా పెళ్ళిపెటాకులు లేకుండా నాతో కాపురం చేయడానికి ఇష్టపడ్తారా?" మళ్ళీ అడిగింది సీత.

బుచ్చిబాబు సీత వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"నేను అన్నీ లోచించే నిర్ణయాలు తీసుకున్నా సీత. మనం ఈ ఊళ్ళోనే వుండము. వేరే ఉరికెళ్లి అక్కడ కాపురం పెడ్తాం" తన తెలివి తేటలకు మురిసిపోతూ అన్నాడు బుచ్చిబాబు.

సీత ఆలోచనలో పడింది.

"ప్లీజ్ సీతా. కాదనకు. ఓ వేళ నేను తీసుకున్న నిర్ణయం సరైనది కాదని రుజువైననాడు నేను నలుగురిలో నిన్ను పెళ్లిచేసుకుంటా. సరేనా? నా మాటని నమ్ముతావుగా?" అన్నాడు

బుచ్చిబాబు.

కొన్ని క్షణాలు ఆలోచించిన తరువాత సీత అంది.

"ఏమో బాబూ. ఇంక నీ ఇష్టం. నీ మీద నాకున్న ప్రేమవల్ల నిన్ను కాదని అనలేకపోతున్నా!"

0 0 0

"సార్!" మెల్లగా పిలిచాడు బుచ్చిబాబు.

ఏకాంబరం ఫైళ్ళలోంచి తలెత్తి చూసాడు. ఏంటి అన్నట్లు కళ్లు ఎగరేసాడు.

"చిన్న రిక్వెస్టు సార్"

"నాన్చకుండా త్వరగా చెప్పు. నీలాగా మరో నలుగురు లస్కుటపాకిలు వచ్చి నానుస్తూ మాట్లాడ్తే మొత్తం ఫైళ్ళన్నీ పెండింగ్‌లో పడిపోతాయ్"

"అబ్బే....నేను ఎక్కువగా నాన్చను సార్! మరేమో నాకు విజయవాడకి అయిన ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ అయింది కద్సార్"

"ఊ.....ఇప్పుడు ప్రమోషన్ కావాలా?" వ్యంగ్యంగా అడిగాడు ఏకాంబరం.

"అబ్బే......అంత పెద్ద కోరికలేం లేవు సార్, నా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను కాన్సిల్ చేసిన ఆర్డర్‌ని కాన్సిల్ చేయాలి సార్...అంటే నేను విజయవాడ వెళ్లిపోతా సార్"

"వ్వాట్!? ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయించుకోవడమూ. తిరిగి వెళ్లి పోతానని అనడమూ...అంతా నీ ఇష్టమేనా? నీ కళ్ళకి మేమంతా కిల్లారి కిత్తిగాళ్లలా కనిపిస్తున్నామా? అయినా ట్రాన్సుఫర్ వద్దని నువ్వేగా కాన్సిల్ చేయించుకున్నావ్? మళ్ళీ వెళతానంటావేం?"

"కొద్దిగా పర్సనల్ ప్రాబ్లమ్స్"

"కొద్దిగా పర్సనల్ ప్రాబ్లమ్స్ అంటున్నావ్, కనిపించిన లింగులిటుకు గాళ్ళందరి దగ్గరా అప్పులు చేసి ఇక్కడి నుండి జండా ఎత్తేస్తున్నావా ఏంటి?" కళ్ళు ఎగరేస్తూ అడిగాడు ఏకాంబరం .

అతని ప్రశ్నకి బుచ్చిబాబు కంగారు పడిపోయాడు.

"ఛీ ఛీ ఛీ.....ధూ ధూ ధూ...అబ్బే..నేనలాంటి వాడిని కాదు సార్. ఛీ......... యాక్......"

"ఇంక చాల్లే ఆపు. మొత్తము నీ ఉమ్ము తుంపర్లతో నేను తడిచిపోయేలా వున్నాను. అయినా నా చేతిలో ఏముందని ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ని కాన్సిల్ చేసిన ఆర్డర్‌ని కాన్సిల్ చేస్తాను అది హెడ్డాఫీసులో వాళ్లు కదా చేస్తారు?"

“కానీ మీరు బుచ్చిబాబు నాకు అవసరంలేదు. అతన్ని విజయవాడకే పోస్టు చెయండి అని హెడ్డాఫీసువాళ్ళకి లెటర్ రాస్తే పని జరిగిపోతుంది సార్” ప్రాధేయపూర్వకంగా అడిగాడు బుచ్చిబాబు.

“అప్పుడుగానీ హెడ్డాఫీసులో డస్కుఢమాల్‌గాళ్ళు నన్ను సెంట్ పర్సంట్ కిల్తారికి త్తిగాడినని అనుకోరు. చాల్లేవయ్యా భలే సలహా ఇచ్చావ్. హెడ్డాపీసు ఇచ్చే ఆర్డర్స్‌ని కాదనడానికి నేనెంత! నీ ప్రయత్నాలేమో నువ్వే చేస్కో ఫో!” అంటూ ఫైళ్ళలో తల దూర్చేసాడు ఏకాంబరం.

బుచ్చిబాబు నిరాశగా క్యాబిన్‌లోంచి బయటకి వచ్చాడు.

అతని ప్లాన్ ప్రకారం మళ్ళీ విజయవాడకి ట్రాన్స్‌ఫర్ చెయించుకోవాలి. సీత చేత ఒక సంవత్సరంపాటు లాంగ్‌లీవ్ పెట్టించాలి!

అలా ఇద్దరూ కలసి విజయవాడ వెళ్ళి తెలీని మనుష్యుల మధ్య కాపురం పెట్టాలి అప్పుడే సితకు కూడా విజయవాడలో ఏదో ఒక ఉద్యోగం చూడాలి. లేదా తను ఇష్టపడితే ఇంట్లోనే వుంటుంది.

ఈ విషయంలో బుచ్చిబాబు సీతని వొప్పించాడు. కానీ తను విజయవాడకి వెళ్ళడంలో ఏకాంబరం సహకరించడం లేదే! ఎలా?

బుచ్చిబాబు మనసులో టక్కున ఆలోచన మెరిచింది.

మినిస్టర్ మిన్నారావు! యస్! తన ట్రాన్సఫర్ ఆపు చేయించిన మినిస్టర్ మిన్నారావే తిరిగి తనని ట్రాన్సుఫర్ చెయించాలి.

బుచ్చిబాబు హుషారుగా విజిలేసాడు.

రాధ సీత వంక నోరు తెరుచుకుని చూసింది.

“అయితే బుచ్చిబాబు చెప్పినదానికి నువ్వు ఒప్పుకున్నావా?”

“ఒప్పుకోక ఏం చెయ్యమంటావ్? అతనితో తెగతెంపులు చేస్కోమంటావా? బుచ్చిబాబుకి దూరంగా నేనుండలేను” అంది సీత.

“అలాగని నీ జీవితాన్ని బలిపెడతావా?”

“ఛీ ఛీ... బుచ్చిబాబు అలాంటి వాడు కాదు. అన్యాయం చెయ్యడు. ఏదో సిల్లీగా ఆలోచిస్తున్నాడు. అంతే!”

“మరీ ఇంత సిల్లీగానా? అయినా అతను చెప్పింది ఎలా సాధ్యం అవుతుంది? ఇక్కడ అందరికీ తెలుసు మీరు భార్యాభర్తలు కారని! అసలు అతని అమ్మా నాన్నలు ఎలా ఊరుకుంటారు?”

“అందుకేగా అతను వేరే ఊరికి పోయి కాపురం పెడతాం అంటున్నారు. విజయవాడకి ట్రాన్సుఫర్ ట్రయ్ చేస్తానన్నాడు” చెప్పింది సీత.

“మరి నీ విషయం ఏమిటి?”

“నేను లాంగ్‌లీవ్ పెట్టి అతనితోపాటు విజయవాడ వెళతాను ”

“ఏంటో.... నువ్వు చెప్పింది విని నేను జీర్ణించుకోలేకపోతున్నా”

“కానీ తప్పదు. బుచ్చిబాబు చెడ్డవాడు కాడని నాకు తెలుసు. కొన్ని రోజులు పోతే తన ఆలోచనలు తప్పని తెలుసుకుంటాడు. అప్పుడు అందరి ముందు నన్ను పెళ్ళి చేస్కుంటాడు.”

“ఒకవేళ తన తప్పును అతను గ్రహించకపోతే?”

సీత ఆలోచనలో పడింది. అవును...అతను గ్రహించకపోతే?

0 0 0

మినిస్టర్ మిన్నారావు ఇంటివైపు వేగంగా అడుగులు వేస్తున్నాడు బుచ్చిబాబు .

“ఛీ... సమయానికి వెధవ ఇంటిలో లేకుండాపోయాడు” వెంకట్రావ్‌ని తిట్టుకున్నాడు బుచ్చిబాబు.

మినిష్టరు మిన్నారావు ఇంటికి వెంకట్రావుని తోడుగా తీసుకుని వెళదామని అనుకున్నాడు బుచ్చిబాబు. కాని వెంకట్రావ్ పనిమిద సొంత ఊరికి వెళ్ళాడు. అయినా మినిస్టరు మిన్నారావుకు ఓ సారి పరిచయం అయ్యాడుకదా అని తనే స్వయంగా రిక్వెస్టు చేద్దామని బయలుదేరాడు.

నిజానికి వెంకట్రావ్ ఊరునుండి వచ్చేదాకా ఆగచ్చు. కానీ ఈలోగా సీత మనసు ఎక్కడ మారిపోతుందోనని బుచ్చిబాబు భయం. అందుకే త్వరత్వరగా విజయవాడకి ట్రాన్సుఫర్ చేయించుకుని వెంటనే అక్కడికి వెళ్ళిపోయి సీతతో కాపురం పెట్టెయ్యాలని అతని ఆత్రం.

బుచ్చిబాబు మిన్నారావు ఇంటిగేటును సమీపించగానే గేటుదగ్గరున్న గూర్ఖా బుచ్చిబాబుని గుర్తుబట్టి సెల్యూట్ చేసాడు.

బుచ్చిబాబు దర్జాగా తల ఊగించి లోపలికి వెళ్ళాడు. బుచ్చిబాబు డోరుబెల్ నొక్కాడు. కొన్ని క్షణాల తరువాత మినిస్టర్ మిన్నారావు భార్య వెంకటలక్ష్మి తలుపు తీసింది. బుచ్చిబాబుని ఆమె గుర్తుపట్టింది.

“ఓ నువ్వా బాబూ! ఏటీ?” అని అడిగింది.

“మినిష్టర్ గారున్నారాండీ?” అడిగాడు బుచ్చిబాబు.

“ఉన్నారుగానీ నీ పేరేంటో మర్చిపోయానుగానీ ... ఏమని సెప్పమంటావ్?”

“నా పేరు బుచ్చిబాబు. కానీ అలా చెప్పకండి. వీరేశం తాలూకు అని చెప్పండి.”

“అట్టాగే”

ఆవిడ లోపలికి వెళ్ళి అరనిముషంలో బయటకొచ్చింది.

“లోపలికి రా బాబు....” అని వెనక్కి తిరిగి లోపలికి అడుగులు వేసింది. బుచ్చిబాబు ఆమెను అనుసరించాడు. హాల్లో మినిస్టర్ మిన్నారావ్ కూర్చుని వున్నాడు. వెంకటలక్ష్మి ఆయన కూర్చున్న సోఫా ప్రక్కన నిలబడింది.

బుచ్చిబాబుని చూస్తూనే మినిస్టర్ మిన్నారావు చెవులదాకా నవ్వాడు.

“ఆ...... రావోయ్ రా! నీ ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ అయిందిగా. హ్యాప్పీనా?” కులాసాగా కాళ్ళూగిస్తూ అడిగాడు.

“లేదండీ” మెల్లగా అన్నాడు బుచ్చిబాబు.

“అదేటి. నీ ట్రాన్స్‌ఫర్ ఆగిపోయిందిగా?” ఆశ్చర్యంగా అడిగాడు మినిష్టర్ మిన్నారావు.

“చిన్న ప్రాబ్లెం వచ్చిందండీ”

“ఏంటో త్వరగా చెప్పు...ఇప్పుడు నేను చికెన్ సెంటర్ ఓపెనింగ్ చెయ్యడానికి వెళ్ళాలి” చేతి వాచ్ వంక చూస్తూ అన్నాడు మినిస్టర్ మిన్నారావు.

“నేను విజయవాడకి వెళ్ళడానికి ఇష్టం లేక ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేస్కున్నాను కదండీ. కానీ ఇప్పుడు ఎందుకులే.... విజయవాడకే పోదాము అనుకుంటున్నానండి. మా బాస్‌ని అడిగితే అది హెడ్డాఫీసు వాళ్ళ ఇష్టం! నీకు మళ్ళీ ఆర్డర్ వెయ్యాలన్నా వాళ్ళే వెయ్యాలని అన్నాడండీ! అందుకని మీ హెల్ప్ తిసుకుందామని వచ్చానండీ” అన్నాడు బుచ్చిబాబు.

మినిస్టర్ మిన్నారావు కళ్ళు ఇంతింత చేసి బుచ్చిబాబు వంక చూసాడు.

“అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం? నీ కళ్ళకి మినిస్టర్‌లంటే పనీపాట లేని బేవర్స్‌గాళ్ళలా కనిపిస్తున్నారా?” సీరియస్‌గా అడిగాడు.

“అందుకేగా ఓ పండు కాయా ఏటి లేకుండా చేతులూగించుకుంటూ వచ్చాడు” మూతి తిప్పుతూ అంది వెంకటలక్ష్మి.

“అంతా నీ ఇష్టమేనా? నువ్వు వెళ్ళను అంటే నీ ఆర్డర్ కాన్సిల్ చెయించాలా? మళ్ళీ వెళ్తానంటే నీకు ఆర్డర్స్ వేయించాలా.....ఇలా ఒక పనినే పది సార్లు చెస్తే మిగతా పనులు ఎలా అవుతాయ్? అసలే అయనకి ప్రతిరోజూ చికెన్ సెంటరూ, కిళ్ళీషాపు ఓపనింగ్ లాంటివి వుంటాయ్” దీర్ఘాలు తీస్తూ అంది వెంకటలక్ష్మి.

బుచ్చిబాబు బిత్తరపోయాడు. మినిష్టర్ మిన్నారావు అలా మాట్లాడతాడని అనుకోలేదు.

‘ఛ....... ఛ........ వెంకట్రావ్ ఊర్నుండి వచ్చేదాకా ఆగి వాడితో కలిసిరావల్సింది’ అనుకున్నాడు.

“ఇంక వెళ్ళు బాబు” అన్నాడు మినిస్టర్ మిన్నారావు.

“అంటే నేను సరదాకి సిల్లీగా చెయ్యడం లేదండీ. నాకు కొన్ని ఫామిలీ ప్రాబ్లెమ్స్ వచ్చి.....” బుచ్చిబాబు ఏదో చెప్పబోయాడు.

“ఒకసారి కుదరదని చెప్పాక కుదరదు. ఇంకా అడుగుతావేంటి అసలే నాకు చికెన్ సెంటర్ ఓపెన్ చేసే టైం అయింది” అంటూ వాచ్ వంక చూసి “అమ్మో...టైమయిపోయింది” అని సోఫాలోంచి గబుక్కున లేచి నిలబడ్డాడు.

“అవునే లక్ష్మి ......ఈ సెక్రటీగాడు ఇంకా రాలేదు? డ్రైవర్‌ని కారు తీసి ఉంచమను” అని హడావుడిగా భార్యకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి బుచ్చిబాబు వంక విసుగ్గా “నువ్వింక వెళ్ళు” అన్నాడు.

బుచ్చిబాబు మనసు చివుక్కుమంది. తన భవిష్యత్తంతా ఇప్పుడా ట్రాన్స్ఫర్ కాకపోతే ఉన్న చోటే తెలిసిన వాళ్ళ మధ్య పెళ్ళిగిళ్ళి లేకుండా సీతతో కాపురం పెట్టలేడుగా మరి?

బుచ్చిబాబు భారంగా నిట్టూర్చి వెనక్కి తిరిగాడు.

0 0 0

బుచ్చిబాబు ఇంటికెళ్ళేసరికి అతనికోసమే పర్వతాలరావు, పార్వతమ్మ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

"ఏరా వెధవాయ్. ఇంసేపూ అడ్డగాడిదలా ఎక్కడ తిరిగావ్? ఇందాకటి నుండీ నీకోసమే ఎదురు చూస్తున్నాం" అన్నాడు పర్వతాలరావు.